



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూర్యాపేట పట్టణంలోకి చేరుకోగానే మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళా నేతలు.. కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ.. గులాబీ జెండాలతో ర్యాలీలో నినదిస్తున్న యువకులు

> ఈ కర్కశ కాంగ్రెస్ పీడను వదిలించాలంటే గులాబీ జెండాతోనే, బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు గుర్తించారు. ఈ 15 నెలల్లో ఎక్కడికి పోయినా బీఆర్ఎస్ మళ్లీ రావాలని, కేసీఆరే కావాలని కోరుకుంటున్నరు. అసెంబ్లీలో ఓడిండ్రు.. పార్లమెంట్‌లో ఒక్క సీటు గెల్వలేదు. ఇగ వీళ్ల పని అయిపోయింది.. పార్టీ మూతపడుతదని చాలా మంది అనుకున్నరు. కానీ ఒక ఫీనిక్స్ పక్షిలా మళ్లీ అద్భుత పోరాట పటిమతో తిరిగి అధికారంలోకి వస్తం.
>
> - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# ప్రజలను కాపాడేది కేసీఆరే

## ఆయన నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలి.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఊరికి ఒక్కరున్ననాడే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణను కాపాడుకున్నరని, ఇవ్వాళ జనాలను కాపాడుకోవడం ఎలాగో ఆయనకు తెలుసని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేటలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. 'తెలంగాణ ఉద్యమం కోసం 2001లో పార్టీ స్థాపించిన నాడు నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు, తెలంగాణ ప్రాంతంలోని వారి తొత్తులు 'జై తెలంగాణ' అంటే అవహేళన చేశారు. ఆనాడు చాలా చోట్ల ఊరికి ఒక్కరే 'జై తెలంగాణ' అన్నవారు ఉంటేనే తల్లి కోడి పిల్లలను కాకుల నుంచి, గద్దల నుంచి ఎట్లా రెక్కల కింద పెట్టి కాపాడుకుంటుందో కేసీఆర్ ఆ పద్ధతుల్లో ఉద్యమకారులను కాపాడుకొని ఉద్యమాన్ని నడిపించారు. నేడు మాయమాటలు, మోస



పూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి కొత్త పథకాలు ఇవ్వకున్నా కనీసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాటిని కొనసాగించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంటే ప్రజలను కాపాడుకోవడం ఎలాగో కేసీఆర్‌కు బాగా తెలుసు. ఆనాడు కేసీఆర్ వెంట నిలబడితే మాకేమన్నా అవుతుందేమోనని లాగులు తడుపుకొన్న నాయకులు నేడు అవాకులు చవాకులు పేలుతున్నారు. తెలంగాణను అనేక రంగాల్లో దేశంలో ముందు నిలిపింది కేసీఆర్. గులాబీ జెండా.. కేసీఆర్ వేర్వేరు కాదు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా ఉరికనే చేయలేదు.. తెలంగాణ రాష్ట్రం తెచ్చిన నాడు లక్ష రూపాయలు లేని తలసరి ఆదాయాన్ని రూ.3 లక్షలకు తీసుకువచ్చారు. ఆరేండ్లలో లక్షల ఉద్యోగాలు వచ్చేలా కేటీఆర్ పని చేశారు. రైతుబంధు, రైతుబీమాను దేశం మొత్తం కోరుకున్నది. గుజరాత్‌లో రాని కరెంట్‌ను కేసీఆర్ ఇస్తుండు.. నువ్వెందుకు ఇవ్వడం లేదని మోదీపై కొట్లాటకు రోడ్లెక్కిండ్రు. నేడు దేశంలో ఆకలిచావులు విపరీతంగా ఉన్నాయి. కానీ, తెలంగాణలో మూడు పూటలా కడుపునిండా అన్నం తినేలా కేసీఆర్ పాలన చేపట్టారు. అలాంటి కేసీఆర్ నాయకత్వంలో మనమంతా పని చేస్తున్నందుకు గర్వపడాలి. రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యకర్తలు పెద్దఎత్తున కదం తొక్కి వరంగల్ సభకు వెళ్లి విజయవంతం చేయాలి' అని పిలుపునిచ్చారు.



### కేసీఆరే జాతిపిత: గాదరి

14 ఏండ్లు నిర్విరామంగా ఉద్యమం నడిపి, దేశంలోని అన్ని పార్టీలను ఒప్పించి, తెలంగాణ రాష్ట్రం తెచ్చిన కేసీఆర్ తెలంగాణ జాతిపితేనని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్పష్టం చేశారు. 'ఈ మధ్య ఒకడు.. 'కేసీఆర్ జాతిపిత అంట' అని విమర్శించిండు. అసెంబ్లీలో బట్టలూడదీసి కొడతానని నోటికొచ్చింది మాట్లాడుతుండు. 2009లో మిమ్మల్ని బట్టలూడదీసి కొట్టేంత పరిస్థితి వచ్చింది నిజం కాదా?' అని ప్రశ్నించారు.

### కేసీఆర్ రావాలె.. తెలంగాణను కాపాడాలె: బొల్లం

నమ్మి ఓట్లేసి మోసపోతున్న జనం కష్టాలు తీరాలంటే గొంతెత్తి మాట్లాడే కేసీఆర్ జనంలోకి రావాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. 'కేసీఆర్ వేసే ప్రశ్నలకు ప్రభుత్వం దిగొస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. మీరు ఎండిన పొలాల్లోకి రావాలి. మీకు సైన్యంగా మేమంతా ఉంటాం' అని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇతర రాజకీయ పార్టీలు అధికారం కోసం ఎగబెడితే కేసీఆర్ మాత్రమే జనంకోసం ఆలోచించే ఏకైక నాయకుడని తెలిపారు. సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నలమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సోమ భరత్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్, రాజీవ్‌సాగర్, వై వెంకటేశ్వర్లు, కంచర్ల కృష్ణారెడ్డి, గుజ్జ దీపిక, పెరుమాళ్ల అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.





### పులి కడుపున పులే పుట్టింది: బడుగుల

బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. సూర్యాపేటకు కేటీఆర్ వస్తే బ్రహ్మాండంగా భారీ ర్యాలీ జరిగిందని పేర్కొన్నారు. 'పులి కడుపున పులే పుడుతుందని కేసీఆర్ తనయుడిగా కేటీఆర్ నిరూపించుకున్నారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చి ఐటీకి వన్నె తెచ్చారు. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా ముందుకు తీసుకెళ్లే దమ్ము బీఆర్ఎస్ కార్యకర్తలకు ఉంది. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయి' అని తెలిపారు.




# రామన్నా.. సేవ్ తెలంగాణ

**సర్కారు తీరుపై విసుగెత్తి ఆడబిడ్డ కంటతడి**

- పంటలు ఎండుతుంటే గుండె తరుక్కుపోతున్నది
- ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం నరకం చూపిస్తున్నది
- సంతోషమంతా కండ్లముందే చెదిరిపోతున్నది
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది
- సభలో కేటీఆర్ ఎదుట ప్లకార్డు పట్టుకొని ఆవేదన

సూర్యాపేట, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ఓ మహిళ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశంలో 'సేవ్ తెలంగాణ రామన్న' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ కంటతడి పెట్టారు. 'సేవ్ తెలంగాణ రామన్న' అనే ప్లకార్డుతో సమావేశానికి వచ్చిన ఆమెను 'నమస్తే తెలంగాణ' పలకరించగా తన మదిలోని బాధలను పంచుకున్నారు. 'నా పేరు రాధ. నేను మునగాల మండలం ముకుందాపురం మాజీ సర్పంచ్‌ను. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మా ఊరికి కాళేశ్వరం నీళ్లు వస్తే పంటలు బాగా పండించుకున్నాం. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నాయకులు అనేకం ఇస్తామంటే అదంతా మోసమని మా వాళ్లకు చెప్పినప్పటికీ ఆశతో ఆ పార్టీకి ఓట్లు వేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నరకం చూపిస్తున్నది. ఇయ్యాల నీళ్లు రాక కండ్లముందు ఎండిపోతున్న పంటలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది. పుండు మీద కారం చల్లినట్టు.. రైతుబంధు అందడం లేదు. పంట పెట్టుబడి కోసం మళ్లీ చెయ్యి చాచాల్సి వస్తున్నది. చేస్తమన్న రుణమాఫీ చేయలేదు. మహిళలకు అదిస్తం.. ఇదిస్తం.. అని ఊరించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి వెక్కిరిస్తున్నరు. మహిళలకు ఇస్తమన్న రూ.2500 ఊసే ఎత్తడం లేదు. గ్యాస్ సిలిండర్ పథకం గ్యాసేనని తేలిపోయింది. ఉచిత కరెంటు ఇస్తమని చెప్పి ఇప్పుడు అసలు కరెంటే లేకుండా చేసిన్రు. ఉచిత బస్సు పథకం పెట్టి మహిళల మధ్య కొట్లాట పెట్టిన్రు. బస్సుల సంఖ్య తగ్గించిన్రు. ఉన్న ఒకటి, అర బస్సులు సమయానికి రావు. అక్కచెల్లెమ్మలు జుట్టు జుట్టు పట్టుకొని కొట్టుకునేలా తగువు పెట్టి నవ్వుకుంటున్నరు. కేసీఆర్‌కు ఓట్లేసిన వృద్ధులు, దివ్యాంగులపై రేవంత్‌రెడ్డి కక్ష పెంచుకుండు. అందుకే పింఛన్లు పెంచట్లే. ఉన్న పింఛన్లు ఇవ్వట్లే. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయి. ఊళ్లల్లో మంచినీళ్లు వస్తలేవు. కాంగ్రెస్ జెండాలు మోసి, ఆ పార్టీకి ఓట్లు వేయించిన నిరుద్యోగులు ఇప్పుడు అరిగోస పడుతున్నరు. వారి బాధను ఎవ్వరికీ చెప్పుకోవాలో తెల్వక కుమిలిపోతున్నరు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. కలలన్నీ కండ్ల ముందే చెదిరిపోతున్నయి. ఏపీలో ఉన్నప్పుడు అయ్యాళ ఉన్నట్టే ఈ రోజున ఊళ్లల్లో కరువుతో దుమ్ము లేస్తున్నది. కేసీఆర్ ఉన్నప్పుడు అంతా మంచిగుండే. నేడు కండ్లముందే అన్నీ చెదిరిపోతుంటే పాణం పోయినంత పనయితున్నది. గుండె తరుక్కుపోతున్నది. కేటీఆర్ అన్న కనిపించడంతో 'సేవ్ తెలంగాణ రామన్న' అని ప్లకార్డుపై రాసి ప్రదర్శించాను. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలి. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తెలంగాణను బతికించాలి' అని చెబుతూ మాజీ సర్పంచ్ రాధ విలపించారు.







అగో అన్నొచ్చిండు: సూర్యాపేట పట్టణంలో కేటీఆర్‌ను తన కొడుకుకు చూపుతున్న మహిళ.. అభివాదం చేస్తున్న యువతులు, ఆసక్తిగా చూస్తున్న యువకులు



# జనం జేజేలు.. క్యాడర్ కేరింతలు

- సూర్యాపేట పట్టణంలో కేటీఆర్‌కు జన నీరాజనం
- అడుగడుగునా సమరోత్సాహం
- కాంగ్రెస్‌పై కనిపించిన కసి
- కదంతొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- కేటీఆర్ రాకకోసం ఎదురుచూపు
- దారిపొడవునా జనం జేజేలు
- ఆప్యాయంగా కేటీఆర్ పలకరింపు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 20(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూర్యాపేట పర్యటన జనం జేజేలు... క్యాడర్ కేరింతలు... అభిమానుల ఎదురుచూపులు.. యువత ఉత్సాహం నడుమ ఆద్యంతం నూతనోత్సాహంతో సాగింది. దారిపొడవునా పార్టీ నేతలు, శ్రేణులతో పాటు సామాన్య జనం సైతం కేటీఆర్ రాక పట్ల అమితాసక్తిని చూపారు. ఇక సూర్యాపేట పట్టణంలోనైతే పట్టణ ప్రజల ఆత్మీయ పలకరింతలకు కేటీఆర్ అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ ముందుకుసాగడం ఎంతగానో ఆకట్టుకుంది. గురువారం సూర్యాపేటలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల ప్రారంభ సభ విజయవంతం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పార్టీ సన్నాహక సమావేశానికి హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అడుగడుగునా జనం నీరాజనం పట్టారు. హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ ఉమ్మడి జిల్లాలోకి కొత్తగూడెం వద్ద ప్రవేశించగానే పార్టీ నేతలు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు, నకిరేకల్ లాంటి చోట్ల మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్టీ నేతలు కేటీఆర్‌ను స్వాగతించారు. కేటీఆర్ సూర్యాపేట పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్స్ వరకు చేరుకునేసరికే జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది ఎదురుచూస్తూ కనిపించారు. ఒక్కసారిగా కేటీఆర్ కాన్వాయ్‌ను చూడగానే సీఎం సీఎం అంటూ పెద్దపెట్టున దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్‌లపై కేటీఆర్‌ను సూర్యాపేట పట్టణంలోకి ర్యాలీగా తీసుకెళ్లారు. కొత్త బస్టాండ్ నుంచి కేటీఆర్ తన కారు సన్‌రూఫ్‌లో నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

**పట్టణ ప్రజల అమితాసక్తి..**

సూర్యాపేట పట్టణంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కేటీఆర్ ర్యాలీగా ముందుకు సాగగా అడుగడుగునా పట్టణ ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముందు వేలాదిమంది యువత బైక్‌లపై ముందు వరుసలో ఉండగా వారి వెనకాలే కేటీఆర్ అభివాదం చేస్తూ ముందుకుసాగారు. కొత్త బస్టాండ్ నుంచి దారికి ఇరువైపులా దుకాణదారులు, సామాన్య ప్రజలు కేటీఆర్ కోసం బయటకు వచ్చి ఎదురుచూస్తూ కనిపించారు. వీరంతా కేటీఆర్‌ను చూస్తూ చేతులు పైకెత్తి జేజేలు పలికారు. కొందరు కేటీఆర్ సీఎం సీఎం అంటూ నినాదాలు చేస్తూ అభివాదం చేశారు. దాదాపు ప్రతీ దుకాణం ముందు ప్రజలు కేటీఆర్ కోసం బయట నిలబడి ఎదురుచూడడం విశేషం. రోడ్డు వెంట ఉన్న చిరువ్యాపారులు, బడ్డీ కొట్టువాళ్లు సైతం కేటీఆర్‌ను చూడడానికి, ఆయనకు నమస్కారం చేయడానికి ఎదురుచూశారు. దీంతో కేటీఆర్ సైతం రెండువైపులా చూస్తూ... ప్రజల అభివాదాలకు ప్రతిగా.. రెండు చేతులు జోడించి అభివాదం చేస్తూ ముందుకుసాగడం ఎంతో ఆకట్టుకుంది. గండూరి బ్రదర్స్‌కు చెందిన కాంప్లెక్స్ వద్దకు కేటీఆర్ ర్యాలీగా చేరుకున్నప్పుడు ఆ కాంప్లెక్స్‌లోని కస్టమర్లు బయటకొచ్చి జేజేలు కొట్టి తమ అభిమానాన్ని చాటుకున్నా రు. ఇక దుకాణాల పైనుంచి, ఇండ్ల మీద నుంచి మహిళలు, యువత కేటీఆర్ రాక కోసం ఎదురుచూస్తూ కనిపించారు.

**క్యాడర్ కేరింతలు**

కేటీఆర్ పర్యటన ఆసాంతం యువత సమరోత్సాహంతో కదం తొక్కింది. బైక్ ర్యాలీలో సగానికి పైగా యువతే పాల్గొనడం విశేషం. కేటీఆర్ రాక కోసం సుమారు గంటకు పైగా ఎదరుచూస్తూ ఉన్న యువత కేటీఆర్ కాన్వాయ్ కనపడగానే కేరింతలు కొట్టారు. సీఎం సీఎం అంటూ దద్దరిల్లేలా అరిచారు. అత్యంత క్రమశిక్షణగా కేటీఆర్ వాహనం ముందు బైక్‌లపై ర్యాలీగా కదిలారు. వేలాది బైక్‌లు కావడంతో ప్రారంభం నుంచి చివరి వరకు కిలోమీటర్‌కు పైగానే ప్రవాహంలా కనిపించాయి. 4 కిలోమీటర్లకు పైగా సాగిన ర్యాలీ మధ్యాహ్నం 1.19 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకున్నది.

## కాంగ్రెస్‌పై కసితో...

బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల ఉత్సవాల కోసం నిర్వహించిన సన్నాహక సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల తీరు ప్రభుత్వంపై స్పష్టమైన కసిని వెల్లడించింది. ఏదో పార్టీ మీటింగ్ కదా... ఏదో వచ్చాం... వెళ్లాం అన్నట్లుగా కాకుండా ప్రతీ ఒక్కరిలోనూ ఒక రకమైన ఉద్రేకం, ఉత్సాహం కనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో క్షేత్రస్థాయిలో నెలకొన్న అధ్వాన పరిస్థితులు ప్రజలతో పాటు పార్టీ శ్రేణుల్లోనూ కదిలిస్తున్నట్టు అర్థమైంది. ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు సంపూర్ణంగా ఐదేండ్ల పాటు సాగునీరు అందింది. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లోని ప్రతి ఎకరాకు నీరందించి 2 పంటలు పుష్కలంగా పండాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే రెండు సీజన్లలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ యాసంగిలో పంట ఎండని రైతు లేడంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై జగదీశ్‌రెడ్డి, గాదరి కిషోర్, బొల్లం మల్లయ్య, బడుగుల నిత్యం రైతుల్లో తిరిగారు.

## మోసకారి కాంగ్రెస్‌ను నిలదీయండి

- **కేటీఆర్‌కు ఆటో కార్మికుల వినతి**

మిర్యాలగూడ టౌన్, మార్చి 20: కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ఉపాధి కోల్పోయి కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్న ఆటో కార్మికులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. కేటీఆర్ గురువారం సూర్యాపేటలో సమావేశానికి వస్తున్నారని తెలుసుకున్న ఆటో కార్మికులు నార్కట్‌పల్లిలోని వివేరా హోటల్ వద్దకు చేరుకుని ఆయనను కలిశారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన తెలంగాణ ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నాజర్ అలీమీర్జా మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని, కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి అనేకమంది ఆటోకార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

